అభివృద్ధి పనుల కోసమే..

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, మార్చి 5 : రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం నగరంలోని తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే చేవెళ్ల నియోజకవర్గానికి మంజూరైన సీడీపీ నిధులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎంను కలువడంలో ఎలాంటి రాజకీయ కోణం లేదని ఎమ్మెల్యే యాదయ్య స్పష్టం చేశారు.

నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌వోబీ చీఫ్ జనరల్ మేనేజర్ అనుజ్ రంజన్

డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై అవగాహన

ఇబ్రహీంపట్నం, మార్చి 5 : ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్, సైబర్ ఫ్రాడ్స్, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌పై జాతీయస్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌వోబీ చీఫ్ జనరల్ మేనేజర్ అనుజ్ రంజన్ పాల్గొని మాట్లాడుతూ.. కంప్యూటర్‌ను సాధనంగా లేదా నేరాలకు పాల్పడే మార్గంగా ఉపయోగించే నేరపూరిత చర్యలన్నీ కూడా సైబర్ నేరాల కిందకు వస్తాయన్నారు. కంప్యూటర్స్ ఆధారిత నేరం, కంప్యూటర్ నెట్‌వర్క్, డివైజ్‌లను లక్ష్యంగా చేసి దాడి లేదా నేరపూరిత చర్యను సైబర్ క్రైమ్ అంటారని తెలిపారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనుకునే సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు ఇంలాంటి నేరాలకు పాల్పడుతారన్నారు. వ్యక్తులు లేదా సంస్థలు ప్రణాళిక ప్రకారం ఉమ్మడి లక్ష్యం కోసం ఈ రకమైన మోసాలు చేయాలనుకుంటున్నారన్నారు. ప్రస్తుతం దేశంతోపాటు ప్రపంచ దేశాల్లో ఈ సైబర్ నేరాల బారిన పడుతున్నవారు ఎందరో ఉన్నారని ఆయన తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ కోహ్లీ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సైబర్ నేరాలపై తమ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హెచ్‌ఎస్ షైనీ, ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, మార్చి 5 : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధించి ఆర్థిక సహాయం మంజూరు చేసేందుకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డిజిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఇంగ్లండ్, స్విట్జర్‌ల్యాండ్, కెనడా, న్యూజీలాండ్, సింగపూర్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, జర్మనీలలో గల విదేశీ విద్యాలయాల్లో మెడిసిన్/ఇంజినీరింగ్/ఫార్మసీ ప్రొఫెషనల్ కోర్సుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సులు చదవాలనుకుంటున్న విద్యార్థులకు రూ.20లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడానికి దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లతో పాటు నిర్ణీత ఫార్మాట్లతో ప్రవేశం పొందేందుకు epasswebsite : http://telangana.epass.cgg.gov.inలో మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

షాబాద్, మార్చి 5 : రంగారెడ్డిజిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 69,731 మంది విద్యార్థులకు 68,208 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 195 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ టీవీల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పల్స్ పోలియో విజయవంతం

పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించిన రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

చింపోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 5 : 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖాన, ఆర్టీసీ బస్టాండ్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ నరహరితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలో నవజాత శిశువులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ ఎంత మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారో వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లాలని, అక్కడ చిన్నారులను గుర్తించి వారందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. పోలియో వ్యాధి బారిన పడిన పిల్లలకు అంగవైకల్యం సంభవిస్తుందని పేర్కొన్నారు. పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండలం చింపోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వచ్చే ప్రతి గర్భవతికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పట్టణంలోని అయ్యప్పకాలనీలోని గుడిసెల వద్ద, చింపోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిషన్‌నగర్ సబ్ సెంటర్ సమీపంలోని ఇటుక బట్టీల వద్ద చిన్నారులకు ఎప్పుడు పోలియో చుక్కలు వేశారని అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క చిన్నారినీ మిస్‌కాకుండా పోలియో చుక్కలు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చిండోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ జగదీశ్, హైల్త్ సూపర్‌వైజర్లు శ్రీరామ, అమృత, ఉదయ్‌కుమార్, స్టాఫ్ నర్స్ మాధవి, ఏఎన్‌ఎం స్వప్న పాల్గొన్నారు.

సిబ్బంది సహకారం మరువలేనిది

వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్ : జిల్లావ్యాప్తంగా 3 రోజుల పాటు జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మర్పల్లి ట్రాన్సిట్ పాయింట్‌ను సందర్శించి ఆశావర్కర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 5 సంవత్సరాల లోపు 94,558 పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మార్చి 3న ప్రారంభమైన పోలియో చుక్కల కార్యక్రమం 5న ముగిసిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లావ్యాప్తంగా దాదాపు 2500 మంది సిబ్బంది, వివిధ శాఖల సమన్వయం, ప్రజల సహకారం మరువలేనిదని ఆయన తెలిపారు.

వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పాల్వన్‌కుమార్

జాఫర్‌గూడ భూదాన్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 5 : మండలంలోని జాఫర్‌గూడ భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చి వేశారు. తహసీల్దార్ రవీందర్‌దత్తు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీ సహాయంతో అక్రమంగా నిర్మించిన ఇండ్లను కూల్చివేశారు. ఈ సందర్భగా తహసీల్దార్ మాట్లాడుతూ.. జాఫర్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నం.319లో భూదాన్ భూముల్లో కొంతకాలంగా అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారన్న విషయం తెలిసి కూల్చివేశామన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు నమోదు శాతాన్ని పెంచేలా

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

షాబాద్, మార్చి 5 : జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని వంద శాతం పెంచేలా SVEEP అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర SVEEP కన్సల్టెంట్ భవానీశంకర్ రంగారెడ్డిజిల్లాను సందర్శించారు. ఈ సందర్భనలో భాగంగా కలెక్టర్ శశాంకను కలిశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ SVEEP అవగాహనపై తెలంగాణ రాష్ట్ర SVEEP కన్సల్టెంట్ భవానీశంకర్, జిల్లా నోడల్ అధికారి/డీఆర్‌డీవో, జిల్లా సంక్షేమాధికారి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్నికల సూపరింటెండెంట్ తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగారెడ్డిజిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలవారీగా ముఖ్యంగా యువతను ఓటర్‌గా నమోదు చేసుకునేలా SVEEP కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని, రంగారెడ్డిజిల్లాలో లోక్‌సభకు జరుగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచడం గురించి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఓటర్లను పెంచడంపై తెలంగాణ రాష్ట్ర SVEEP కన్సల్టెంట్ భవానీశంకర్, నోడల్ అధికారి, రంగారెడ్డి పీడీ, సరూర్‌నగర్ తహసీల్దార్‌లకు సూచించారు. సమావేశంలో నోడల్ అధికారి/డీఆర్‌డీవో శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణ, ఎన్నికల సూపరింటెండెంట్ సైదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



కొడంగల్ : దరఖాస్తుల వివరాలను తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, మార్చి 5 : ధరణి పోర్టల్‌లో భూ సమస్యల కోసం అందించిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సరళమైన ఓటరు జాబితా ఏర్పాటుపై అన్ని పార్టీల నాయకులతో సమావేశంతో పాటు ధరణి ధరఖాస్తుల పరిశీలనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ముందుగా అన్ని పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సరళమైన ఓటరు జాబితాను రూపొందించేలా అందరూ సహకరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై పార్టీ నాయకులతో చర్చించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే వాటిని సరి చేసుకోవడానికి ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిశీలన, ఇప్పటివరకు పరిశీలించిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. ధరణి పోర్టల్ ద్వారా 519 దరఖాస్తులు రాగా.. వాటిలో ఇప్పటివరకు 110 దరఖాస్తులను పరిశీలించి ఆమోదయోగ్యంగా ఉన్న దరఖాస్తులను ఆమోదానికి పంపించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో మొత్తం దరఖాస్తులను పరిశీలించేందుకు సిబ్బంది పూర్తి చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. కొన్ని దరఖాస్తులకు సంబంధించి భూమి వేరియేషన్ వంటి సమస్య తలెత్తుతున్నదని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాల్సి ఉన్నందున.. దరఖాస్తుల పరిశీలన కొంతవరకు ఆలస్యమవుతున్నట్లు ఆయనపేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ బాబు, గుల్షన్, బషీర్, మోహన్‌రావు, కృష్ణం రాజు, శ్యాం, మహమూద్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

బొంరాస్‌పేట : ధరణిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ నెల 9 లోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. బొంరాస్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్‌ను ఆయన తనిఖీ చేశారు. మండలంలో ధరణిలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటిని ఎలా పరిష్కరిస్తున్నారని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా ధరణి సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. మండలంలో 350 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్‌లో వాటిని పరిష్కరిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

పంటలకు జీవ ఎరువులు వాడాలి

జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్

వికారాబాద్, మార్చి 5 : రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి, జీవన ఎరువులు వాడటం వలన భూమిలో సారవంతం పెరిగి దిగుబడి ఎక్కువగా వస్తుందని జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలంలోని నారాయణపూర్ రైతు వేదికలో కొత్తగడి క్లస్టర్‌కు సంబధించిన వివిధ గ్రామాల రైతులకు రైతు శిక్షణ కేంద్రం రాజేంద్రనగర్ ఏడీఏ ఆర్ఎం దివ్యజ్యోతి, ఎస్ఎం రేష్మం, హిమబిందు ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్, దివ్యజ్యోతి వివిధ పంటల్లో నీటి యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల తయారీ, వాటి ఉపయోగాలను క్లుప్తంగా రైతులకు తెలియజేశారు. టమాట, మిర్చి, వంకాయలో రసం పీల్చు పురుగుల నివారణకు.. మొక్క మొదట్లో వేపనూనె, వేప గింజల కషాయం, సర్ఫ్ ఒక గ్లాస్‌కు మాడు గ్లాసుల నీటిని కలుపుకొని మొక్కలకు పిచికారీ చేయాలని సూచించారు. మొక్క చిన్న వయస్సు నుంచి 15 రోజులకు ఒకసారి స్ప్రే చేయడం వల్ల రసం పీల్చు పురుగుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. పంటల ఎదుగుదలకు అవసరమైన పలు విషయాలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర హోంగార్డుల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీగా మహమ్మద్ చాంద్‌పాషా

వికారాబాద్, మార్చి 5 : తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీగా వికారాబాద్ జిల్లాకు చెందిన మహమ్మద్ చాంద్‌పాషా ఎన్నికయ్యారు. గతంలో హోంగార్డుల జిల్లా అధ్యక్షుడిగా పనిచేసినట్లు ఆయన తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు తోడ్పడినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

రవీంద్రభారతి : కేంద్ర ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలకు స్పష్టిపలికి, పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, రాబోయే ఎన్నికల్లో పార్టీలన్నీ బీసీలకు 9 సీట్లు కేటాయించాలన్నారు.

మిచిగన్ స్టేట్ యూనివర్సిటీతో

ఒప్పందం

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 5 : వ్యవసాయ విద్య ప్రపంచవ్యాప్తంగా మరింత అభివృద్ధి చెందాల్సి ఉందని, జాతీయ వ్యవసాయ విస్తరణ మేనేజ్‌మెంట్ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మేనేజ్ కార్యాలయంలో యూఎస్ఏ మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ (ఎంఎస్‌యూ) డైరెక్టర్ డా. క్వింటన్ టేలర్ విద్యా విభాగానికి చెందిన సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టేది వ్యవసాయ శాస్త్రమని, ఈ రంగంలో ఉపాధి మార్గాలు అనేకమున్నాయన్నారు. యువత వ్యవసాయ విద్యకు మరింత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. నూతన వంగడాలు, ప్రపంచానికి కావాల్సిన ధాన్యం పండించేందుకు అధునాతన పరిజ్ఞానం అవసరమన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయ రంగం నూతన పోకడలు , అభివృద్ధి చెందుతున్న భారత్‌లో మ్యాన్ పవర్ అధికంగా ఉందన్నారు. ఇప్పుడిప్పుడే భారత్‌లో వ్యవసాయ రంగంపై అధునాతన విజ్ఞానంపై దృష్టి పెట్టిందన్నారు.ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ఎంఎస్‌యూ, మేనేజ్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు .

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మార్చి 5 : ఉచితంగానే ప్రజలకు ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉదయం 10గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయదలచిన రూ.20వేల కోట్లను నిరసిస్తూ ప్రజల తరపున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు గతంలో ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని వారు చెప్పారని.. ఇప్పుడు అదే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అధికారంలోకి రావడానికి అనేక తప్పుడు వాగ్దానాలు చేశారన్నారు. ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. హామీలివ్వడం కాదు.. అమలు చేసి చూపించాలన్నారు. ప్రజలెవరూ కూడా ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టకూడదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

ఆర్కేపురం : ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరికి నిరసనగా ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9:30లకు బడంగ్‌పేట్ కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల వద్ద ఎలాంటి రుసుము వసూలు చేయొద్దని చెప్పి, అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.20వేల కోట్ల ధనాన్ని ప్రజల వద్ద ముక్కు పిండి వసూలు చేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అధికారులకు సూచనలు చేస్తున్న రాచకొండ కమిషనరేట్ సీపీ తరుణ్‌జోషి

పోలీసులపై నమ్మకం కలిగించాలి

మన్సూరాబాద్, మార్చి 5: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి సీపీ తరుణ్ జోషి మంగళవారం ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ పోలీస్‌స్టేషన్, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్, సీడీఈఈబ్ల్యూ భరోసా కేంద్రాలను సందర్శించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్, పలు విభాగాల పనితీరు, సీసీటీవీ కెమెరాల నిర్వహణ వంటి అంశాలను సీపీ తరుణ్‌జోషి సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసే విధంగా వాతావరణం ఉండాలని అధికారులకు సూచించారు. కేంద్ర ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదలయ్యే అవకాశం ఉన్నందున స్పెషల్ బ్రాంచ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. భరోసా కేంద్రాల ద్వారా మహిళల సంరక్షణకు, మహిళల భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భరోసా కేంద్రాలకు వచ్చే మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లల చేతిలో హింసను, నిరాధరణను ఎదుర్కొంటూ పోలీస్‌స్టేషన్‌కు రాలేని బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ 8712662111 నంబర్‌కి గాని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేకూరుస్తామని తెలిపారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ క్రిష్ణయ్య, నాగోల్ ఎస్‌హెచ్‌ఓ పరశురాం పాల్గొన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

బల పరీక్షకు హాజరుకాని కౌన్సిలర్లు

తుర్కయాంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్న హరిత

తుర్కయాంజాల్, మార్చి 5 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బల పరీక్షకు కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో వీగిపోయింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో రాగన్నగూడ వార్డు కార్యాలయంలో బల పరీక్ష నిర్వహణకు సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు వైస్ చైర్‌పర్సన్ వర్గానికి చెందిన కౌన్సిలర్లు కానీ, ఆమె వ్యతిరేక వర్గానికి చెందిన సభ్యులు కానీ హాజరు కాలేదు. అరగంట పాటు వేచిచూసినా కౌన్సిలర్లు రాక పోవడంతో దీంతో అధికారులు సమావేశాన్ని 12 గంటలకు వాయిదా వేశారు. అయినా కౌన్సిలర్లు రాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీవో అనంతరెడ్డి ప్రకటించారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి తెరపడినట్లయింది. వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోవడంతో ఆమెనే వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు.

భారీ బందోబస్తు

వైస్ చైర్‌పర్సన్ బలపరీక్ష నేపథ్యంలో రాగన్నగూడ వార్డు కార్యాలయం వద్ద పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బల పరీక్ష సమయం మొదలు కాకముందు ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు వార్డు కార్యాలయాన్ని చేరుకొని బందోబస్తును పరిశీలించారు. వార్డు కార్యాలయానికి వాహనాలు రాకుండా బారికేడ్ల